క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి గ్రామంలో కొప్పుల వెలమ సామాజిక వర్గం.. జయహో కొప్పుల వెలమ పేరిట రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తన స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం సంఘ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అంతకు ముందు సంఘ సభ్యులంతా మాజీ ఎమ్మెల్యేను కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వేణుగోపాలనాయుడు, కె.శ్రీనివాసరావు, పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు



బిల్లాణిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: గంజాయి, ఖైనీ, గుట్కా తదితర మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తలతంపర, బిల్లాణి గ్రామాల్లో మత్తు పదార్థాలు–వాటి వల్ల కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులంతా ఫ్యాషన్ మాయలో పడి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలి



బొద్దాం గ్రామస్తులకు సూచనలిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న గ్రామదేవత పండగను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆ గ్రామస్తులతో ఆదివారం సమావేశమైన ఆయన.. పండగలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం ఎటువంటి గొడవలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామస్తులదేనని హామీపత్రం తీసుకున్నారు. ఎస్‌ఐ వై.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ లీగ్ సీజన్-4 ఆరంభం



పోటీలు జరుగుతున్న దృశ్యం

సంతకవిటి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంతకవిటి మండలంలోని సిరిపురంలో కబడ్డీ లీగ్ సీజన్–4 పోటీలు ఆదివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. స్వర్గీయ మంగరాజు కామినాయుడు, స్వర్గీయ మీసాల అప్పడుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ మండల స్థాయి పోటీలు పగలూ రాత్రి జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి జరిగే పోటీలను చూసేందుకు సందర్శకులు పోటీపడుతున్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు ట్రోఫీ అందించనున్నట్లు సర్పంచ్ డోల తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కర్రి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ కాబోతుల కళావతి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్య పరిష్కారమైందన్నారు. పంచాయతీ కార్యదర్శి జీవన్ డక్లస్, లైన్‌మెన్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలోని ప్రజలకు ఆదివారం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. సర్పంచ్ గార రమణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు సింగవలస రామ్మూర్తినాయుడు చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి గోవిందరావు ఆధ్వర్యంలో అందజేశారు. ప్రతిరోజూ చెత్తను బుట్టల్లో వేసి, ఇంటి వద్దకు వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు.

దూడల సంరక్షణతోనే.. పాడి వృద్ధి!

- పాడి పరిశ్రమ అభివృద్ధిలో దూడల సంరక్షణే కీలకం
- ఆవుదూడల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి
- వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన అవసరం

రాజాం సిటీ:



బి.జయప్రకాష్



లేగదూడల సంరక్షణతోనే పాడి అభివృద్ధి చెందుతుంది. తగిన జాగ్రత్తలు పాటిస్తూ వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తే పశు సంపద వృద్ధి చెందుతుందని సూచిస్తున్నారు.. రాజాం పశుసంవర్ధక శాఖ ఏడీ బొత్స జయప్రకాష్.. సాధారణంగా ఆవుదూడల్లో వచ్చే వ్యాధుల గుర్చి తెలుసుకుని, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన చాలా అవసరమని చెబుతున్నారు.

పారుడు వ్యాధి..

లేగదూడల్లో మరణాలు 25 నుంచి 30 శాతం వరకు పారుడు వ్యాధి వల్లే సంభవిస్తాయి. అంతర్‌పరాన్న జీవులు, ప్రోటోజోవన్, వైరస్, బ్యాక్టీరియాల కారణంగా చిన్న దూడల్లో తెల్లని, పచ్చని విరేచనాలు అవుతాయి. తద్వారా లేగదూడలు డీహైడ్రేషన్‌కు గురై, నీరసపడి మరణిస్తాయి. దూడ గర్భంలో ఉన్నప్పుడే అంతర్‌పరాన్న జీవులు వ్యాప్తి చెందుతాయి. మట్టి తినడం, అపరిశుభ్ర పరిసరాల వల్ల కూడా దూడల్లో పరాన్నజీవులు చేరి హాని కలిగిస్తాయి. పరాన్నజీవుల బారినపడిన దూడలు ఆరోగ్యంగా కనపడి తెల్లవారేసరికి కిందపడి కాళ్లు తన్నుకుంటాయి. ఈ సమయంలో చికిత్స చేసినా అంత ప్రయోజనం ఉండదు. ఒక్కోసారి దూడలు ఆరోగ్యంగా ఉన్నాయనుకుని పాడి రైతులు ఏలికపాముల నిర్మూలన మందులు తాగించరు. లేగదూడలకు 7–10 రోజుల వయసులో మొదటిసారి, ఆ తర్వాత ప్రతీ 21 రోజులకోసారి మొత్తం 3 నుంచి 4 సార్లు పైపరజిన్ వంటి సురక్షితమైన మందులను తాగించి దూడలను రక్షించాలి. ఐమీరియా, కాక్సిడియా లాంటి ప్రోటోజోవన్‌ల వల్ల దూడలు రక్తం, మ్యూకస్‌తో కూడిన విరేచనాలతో బాధపడతాయి. ఈ ఏకకణ పరాన్నజీవులు ఆశించిన దూడలు కొద్ది విరేచనాలతో ముక్కుతుంటాయి. క్రిప్టోస్పోరిడియం జాతికి చెందిన ప్రోటోజోవన్‌ల మూలంగా మొదటి వారంలో లేగదూడలు పారుకుంటాయి. విరేచనాలు తగ్గకుండా చాలాకాలం బాధపడతాయి.

దూడలకు వ్యాపించే వ్యాధులు..

ఈ కొలై, సాల్మోనెల్లా, షిజెల్లా, క్లాసిడియం, కాంపైలో వంటి బ్యాక్టీరియాల వల్ల దూడలు పారుకుంటాయి. విషపూరిత ఈ కొలై ద్వారా సంభవించే విరేచనాలు అత్యంత ప్రమాదకరమైనవి. రక్తప్రసరణలో ప్రేగుల్లో చేరితే నీరులాగా పారుకుంటాయి. ఇవి ఎక్కువగా 3 నుంచి 5 రోజుల వయసున్న దూడలకు ఆశించి, ఆకస్మిక మరణాన్ని కలిగిస్తాయి. సాల్మోనెల్లా టైపినురియం, సాల్మోనెల్లా డబ్లిన్ రకాల వ్యాధులు 2 నుంచి 6 వారాల వయసున్న దూడలకు ఆశిస్తే దుర్వాసన, రక్తం, మ్యూకస్‌తో కూడిన విరేచనాలు అవుతాయి. వ్యాధి సోకిన లేగదూడలకు జ్వరం వచ్చి త్వరగా బరువు కోల్పోతాయి. చికిత్స చేసినా మరణిస్తాయి. ఇక క్లాస్ట్రీడియం పర్‌ఫిన్‌జైన్స్ ఎ.బి.సి.ఇ రకాల్లో, బీ, సి రకాల వల్ల దూడల్లో రక్త విరేచనాలు, తీవ్ర నీరసం, కడుపునొప్పి వంటి లక్షణాలు గమనించవచ్చు. ఇలా వ్యాధి సోకిన దూడలు కొన్ని గంటల్లో మరణించే ప్రమాదం ఉంది. వైరస్ క్రిముల్లో రోటా, కరోనా, టోగా, పార్వో వైరస్‌ల ద్వారా దూడల్లో విరేచనాలు కలుగుతాయి. 5 నుంచి 15 రోజుల వయసున్న దూడలను ఈ వైరస్ ఆశిస్తుంది. దీనివల్ల ఎక్కువగా విరేచనాలు అవుతాయి. జున్నుపాలు లేగదూడలకు అందివ్వకపోవడం, దూడలకు పాలు తక్కువ ఎక్కువ కావడం, పట్టుపాలు అపరిశుభ్రంగా ఉండడం, ఆహారంలో పోషకాల లోపం, విటమిన్–సి లోపం, చలిగాలులు, ఒత్తిళ్లకు గురికావడం, మట్టి తినడం తదితర యాజమాన్య లోపాల వల్ల కూడా లేగదూడల్లో పారుడు వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

చికిత్స, నివారణ..

- లేగదూడలకు పుట్టిన వెంటనే జున్నుపాలు తాగించాలి. రోజూ మూడు నుంచి నాలుగు సార్లు చొప్పున మొదట రోజులు తాగిస్తే ఇమ్యూనోగ్లాబ్యులిన్ అంది, వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుంది.
- లేగదూడలకు నట్టల నిర్మూలన మందులు క్రమ పద్ధతిలో తాగించాలి.
- వ్యాధి సోకిన దూడలను వేరుచేసి చికిత్స చేయించాలి. నియోక్సి, డైరోలిన్, కొట్రై మల్ వంటి మాత్రలు వాడాలి.

న్యుమోనియా..

నెల వయసు పైబడిన దూడలకు ఎక్కువ శీతాకాలంలో ఈ వ్యాధి సోకుతుంది. షెడ్డులో తేమ ఉండడం, లేగదూడలు ఈదురు గాలులు, చలిగాలులు బారిన పడడం వల్ల సోకుతుంది. వ్యాధి సోకిన దూడలు జ్వరం, అజీర్ణం, బలహీనత, ముక్కు నుంచి చీమిడి కారడం, దగ్గు, గాలి సరిగా పీల్చలేకపోవడం తదితర లక్షణాలతో బాధపడుతుంటాయి. సకాలంలో చికిత్స అందని దూడలు మరణించే అవకాశం ఉంది.

చికిత్స..

- యాంటిబయోటిక్స్, యాంటీ హిస్టమిన్, ఇంజక్షన్లు వాడడం అవసరం.
- జున్నుపాలు సకాలంలో అందక దూడలకు ఈ వ్యాధి సోకుతుంది.
- పుట్టిన వెంటనే జున్నుపాలు సమృద్ధిగా తాగించాలి.
- దూడలను చలిగాలుల నుంచి సంరక్షించాలి.
- పశువుల శాలలను తేమ లేకుండా పొడిగా ఉంచాలి.

ఆ గ్రామాలు భోగి పండగకు దూరం!

- ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచారాన్ని పాటిస్తున్న గ్రామస్తులు



తెర్లాం: భోగి పండగ జరుపుకోని తమ్మయ్యవలస గ్రామం



సంతకవిటి: భోగి పండగ చేసుకోని శ్రీహరినాయుడుపేట

తెర్లాం: సంక్రాంతి పండగ రోజుల్లో మొదట రోజున భోగి పండగను ప్రజలు సరదాగా.. అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే తెర్లాం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు భోగి పండగను కొన్ని దశాబ్దాలుగా జరుపుకోవడం లేదు. గతంలో ఏనాడో జరిగిన భోగి పండగ రోజున ఏదో అరిష్టం జరిగిందన్న నెపంతో వారు భోగి పండగను జరుపుకోవడం మానేశారు. మరికొన్ని గ్రామాల్లో అయితే భోగి పండగ నాడు భోగి స్నానాలు చేసి, భోగి పళ్లు పోసుకున్నప్పటికీ, భోగి మంటను వేయమని గ్రామస్తులు చెబుతున్నారు. భోగి పండగ జరుపుకోని వారిలో తమ్మయ్యవలస, కుమ్మరిపేట, పాములవలస, ఎన్.బూర్జవలస, వి.చిన్నయ్యపేట, ఆమిటి సీతారాంపురం,గొలుగువలస గ్రామస్తులు ఉన్నారు. సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట, కొండగూడేం, కాకరాపల్లి, గొల్లవలస, వాసుదేవపట్నం, పోతులజగ్గుపేట, రంగారాయపురం తదితర గ్రామాలు భోగి పండగ చేసుకోవడం లేదు. అప్పుడెప్పుడో చేసుకున్న భోగి మంటలో పడి పిల్లి చనిపోవడంతో అప్పటి నుంచి పండగ జరుపుకోవడం లేదు.

తప్పిన ప్రమాదం



వంగర మండలంలోని అరసాడ–నీలయ్యవలస రోడ్డులో త్రుటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి బాగెంపేటకు కొంతమంది తమ సొంత పనుల నిమిత్తం కారు బుక్ చేసుకుని వచ్చి, వెళ్తుండగా నీలయ్యవలస సమీపంలోకి రాగానే అదుపు తప్పడంతో అక్కడి గోతిలోకి కారు ఒక్కసారిగా దూసుకెళ్లింది. డ్రైవరు చాకచాక్యంగా వ్యవహరించడంతో అందులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. –వంగర

సంక్రాంతి మేలుకొలుపు



బాడంగి మండల కేంద్రంలోని ముగడ కాలనీలో భజన బృందం సభ్యులు ఆదివారం సంక్రాంతి మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాముడి చిత్రపటం వీధుల్లో ఊరేగిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. ప్రజలందరిలో భక్తిభావం పెంపొందేలా ప్రతిరోజూ ఉదయం ఇలా మేలుకొలుపు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. –బాడంగి

పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సంక్రాంతి పండగ రోజుల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట శిబిరాలు, బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎం.శ్రీను, సీఐ సతీష్‌కుమార్‌లు హెచ్చరించారు. ఇదే విషయమై వారు బొబ్బిలి తహసీల్దారు కార్యాలయంలో కోడిపందాల నిర్వాహకులపై ఆదివారం బైండోవర్ కేసులు నమోదు చేసి, సూచనలు చేశారు. పోలీస్ గస్తీ ముమ్మరం చేసి, పందెంరాయుళ్లపై నిఘా ఉంచామన్నారు. –బొబ్బిలిరూరల్

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తకాలు చదివించి, ఏ విధంగా చదివి వాటిల్లోని విషయాలను అర్థం చేసుకోవాలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పుస్తక పఠనం తప్పనిసరిగా చేయాలని సూచించారు. అందరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, వార్తా పత్రికలు చదవాలన్నారు. పుస్తక పఠనంతోపాటు చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడా పోటీల్లోనూ తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో ప్రతీ విద్యార్థి చేరాలని కోరారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కవి గౌరినాయుడు

రాజాం సిటీ: మానవ జీవనానికి గ్రంథాలయాలు కొత్త వెలుగులు అందిస్తాయని ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరినాయుడు అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న ప్రజా గ్రంథాలయ 11వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. పుస్తకాలు మనిషి జీవితాన్ని మార్చేస్తాయని, గొప్ప గొప్ప వాళ్లు ఎంతోమంది పుస్తక పఠనం ద్వారా తమ మూర్తిమత్వాన్ని, తమ జీవితాలను అద్భుతంగా మలుచుకున్నారన్నారు. యువతతో పాటు ఔత్సాహికులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడాప్ట్ సీఈవో లోలుగు మదన్, సర్పంచ్ గెడ్డాపు అప్పల నాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు పాదిలావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● అపూర్వ కలయిక



రాజాం సిటీ: ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ/రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల.. పూర్వ విద్యార్థుల కలయికకు ఓ చక్కని వేదిక అయింది. ఇదే స్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో 1997 నుంచి 2002 వరకు చదువుకున్న విద్యార్థులు కూడా కలిసి, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు.

బొబ్బిలి: పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాలలో 1992–95 బ్యాచ్ బీఏ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది.

చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న వారంతా ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు.

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ప్రేక్షక పాత్ర



కళ్లెదుటే ట్రాఫిక్ సమస్య ఉన్నా ప్రేక్షకుడిలా చూస్తున్న కానిస్టేబుల్

రామభద్రపురం:

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తూ వాహనచోదకులు, ప్రయాణీకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలో నిత్యం తలెత్తే ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రయాణీకుల వాహనాల రాకపోకలతో రద్దీ ఎక్కువైంది. దీంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పండగ వేళ ట్రాఫిక్ సమస్య ఉంటుందన్న ముందస్తు సమాచారంతో పోలీస్ ఉన్నతాధికారులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను ఏర్పాటు చేశారు. అయితే వారు ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంటల కొద్దీ ట్రాఫిక్ సమస్య ఏర్పడినా తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు, ప్రయాణీకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పోలీసులు ఇలా చేయడం సరికాదని దుయ్యబడుతున్నారు.

ఆదర్శప్రాయుడు వివేకానందుడు



తెర్లాం: ఆమిటిలో వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



వంగర: వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బొబ్బిలిలో వాలీబాల్ పోటీల విజేతలతో నిర్వాహకులు



బొబ్బిలిరూరల్: పక్కిలో వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రతినిధి వేణుగోపాలనాయుడు



రాజాం సిటీ: వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు



రాజాం సిటీ: వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని, వాడవాడలా జాతీయ యువజన దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులంతా కార్యక్రమంలో పాల్గొని, వివేకానందుడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. సనాతన హిందూ ధర్మాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నతమైన వ్యక్తి వివేకానందుడు అని, ఆయన బోధనలు, సూక్తులు అనుసరణీయమన్నారు. నేటి యువతకు ఆదర్శమైన వివేకానందుడి జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకుని, స్ఫూర్తి పొందాలన్నారు. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, లక్ష్మీపురం, అంబకండి తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. ఆదివారం జరిగిన పనుల్లో వీధులు, కాలువల్లోని చెత్తాచెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లారు. అలాగే తాగునీటి బోరుబావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే గ్రామ పరిశుభ్రత సాధ్యమని ఎంపీడీవో శ్యామలకుమారి తెలిపారు. వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో పారిశుధ్య పనులు ఆదివారం చేపట్టారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీధుల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు బ్లీచింగ్ చల్లారు.



రేగిడి: వన్నలి వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ రమణ